
# అంతిమ తీర్పు. కారెల్ ఛాపెక్

అనువాదం: కె. సదాశివరావు



[కారెల్ ఛాపెక్ : (1890 - 1938)

ఛెక్ నవలా రచయితా, నాటకాలూ, కథానికలూ రాసిన ప్రముఖులు. ఈనాడు విస్తృతంగా వాడుతున్న మాట రోబోట్ (ROBOT)ని సృష్టించినది ఇతడే. అతడు రచించిన కామెడీ నాటకం R.U.R "రొసుమ్స్ యూనివర్సల్ రోబోట్స్" లోనిది ఈ పదం 'రోబోటా' అంటే ఛెక్ భాషలో దాస్యం అని అర్థం. అద్భుతమైన వూహా ప్రపంచాన్ని తన రచనలలో సృష్టించాడు ఛాపెక్. అతడు వ్రాసిన "ది వార్ విత్ ది మ్యాట్స్"లో రానున్న ఫాసిజాన్ని గురించి స్పష్టంగా వూహించాడు]

**సామూహిక హంతకుడిగా పేరు పొందిన కుగ్లర్ ఎన్నో వారంట్లూ, ఎన్నెన్నో పోలీసు దళాలూ, డిటెక్టివ్‌లూ వెంటాడుతున్నప్పటికీ తననెవరూ పట్టుకోలేరని శపథం చేశాడు. అతడు దొరకలేదు కూడా. నిజానికి-ప్రాణంతో మాత్రం కాదు.**

అతడు చేసిన తొమ్మిది హత్యల్లో చివరిది-తనని అరెస్ట్ చేయటానికి వచ్చిన పోలీస్ కానిస్టేబుల్‌ని కాల్చివేయడం, పోలీసు మరణించాడు కాని దానికి ముందుగా అతడు కుగ్లర్ శరీరంలో మొత్తం ఏడు బుల్లెట్లు దూసుకుపోయేలా కాల్చాడు. ఈ ఏడింటిలో మూడు బుల్లెట్లు అతడికి ప్రాణాంతకమయ్యాయి. కుగ్లర్‌కి మరణం అతి వేగంగా ముంచుకురావడంతో అతడు ఏ మాత్రం బాధ పడలేదు. భూమికి సంబంధించిన న్యాయాల నుంచి మరో విధంగా కుగ్లర్ తప్పించుకు పోయాడేమోననిపించింది.

అతడి ఆత్మ అతడి శరీరాన్ని వదిలిన తర్వాత తదుపరి ప్రపంచాన్ని చూసినప్పుడు - అది రోదసికి అతీతంగా, బూడిద రంగుతో, హద్దుల్లేకుండా, నిర్మానుష్యంగా వున్నప్పుడు అతడికి ఆశ్చర్యం కలిగి వుండాలి. కాని అలా జరగలేదు. రెండు ఖండాలలో జైళ్ళల్లో మగ్గిన మనిషి అవడం వల్ల ఆ లోకాన్ని అతి సాధారణంగా వున్న వాతావరణంలా భావించాడు కుగ్లర్. తనకున్న కొద్దిపాటి ధైర్యంతో అంతకు ముందున్న లోకంలో మాదిరిగానే ఎలాగో పోరాడి నెగ్గుదామని ఆశించాడు అతడు.

చివరికి అనుకున్న విధంగానే కుగ్లర్‌కి అంతిమ తీర్పు - లాస్ట్ జడ్జ్‌మెంట్! సమయం వచ్చింది.

స్వర్గంలో ఎల్లప్పుడూ వుండే హడావిడి వల్ల కాస్త ఆలస్యంగానే కుగ్లర్‌ని ముగ్గురు న్యాయమూర్తులున్న స్పెషల్ కోర్టులో ప్రవేశపెట్టారు. అతడికి భూమిమీద పూర్వజన్మలో వున్నప్పుడు జూరీ పద్ధతి వుండేది. ఇక్కడ అలాకాదు. కోర్టు రూమ్ చాలా సాధారణంగా భూమి మీద వుండే అన్ని కోర్టుల లాగానే వుంది. కాని ఇక్కడ సాక్షులు ప్రమాణం చేయవలసిన అవసరం లేదు. ముందు ముందు దీనికి గల కారణం అర్థమవుతుంది.

జడ్జీలు వయసుమీరినవారు. యోగ్యత ఉన్న న్యాయమూర్తుల్లా సౌమ్యంగానూ, కాస్త విసుగుతో బోర్ కొట్టిన ముఖాలతో ఉన్నారు. విసుగెత్తించే ఇతర సాధారణ తతంగాలను కుగ్లర్ పూర్తి చేశాడు. ఫెర్డినాండ్ కుగ్లర్, నిరుద్యోగి, ఫలానా తేదీన పుట్టిన వాడు, ఫలానా తేదీన చనిపోయిన వాడు.. ఆ క్షణాన కుగ్లర్‌కి తను మరణించినదెప్పుడో తనకే తెలియని విషయం బయటపడింది.

న్యాయమూర్తుల కళ్ళలో ఇది ముఖ్యమైన డామేజింగ్ విషయమని అతడికి తోచినప్పుడు అతడిలోని ధైర్యం కాస్తా సన్నగిల్లింది.

"నీవు ఈ నేరాన్ని ఒప్పుకుంటున్నావా? లేదా?" అని అడిగాడు ప్రిసైడింగ్ జడ్జి.

"నేను ఏ నేరం చేయలేదు" మొండిగా అన్నాడు కుగ్లర్.

"మొదటి సాక్షిని పిలవండి" అని జడ్జి నిట్టూర్చాడు.

అప్పుడు కుగ్లర్‌కి ఎదురుగా ఓ అసాధరణమైన వ్యక్తి కనిపించాడు.... గంభీరంగా, పొడుగాటి గడ్డంతో, బంగారు నక్షత్రాలు పొదిగిన నీలిరంగు వస్త్రాన్ని కప్పుకుని వున్నాడతడు. అతడు ప్రవేశించినప్పుడు జడ్జీలు గౌరవంతో నిలుచున్నారు. కుగ్లర్ కూడా నిలుచుండి పోయాడు. ఇష్టం లేకపోయినా, మంత్ర ముగ్ధుడిలా. వచ్చిన పెద్దమనిషి, సీటులో కూర్చున్న తర్వాతే జడ్జీలు మళ్ళీ కూర్చున్నారు.

"సాక్షి!" ప్రిసైడింగ్ జడ్జి ప్రారంభించాడు "సర్వ సాక్షివైన భగవంతుడా, ఈ న్యాయస్థానం మిమ్ములను పిలిపించి, ఫెర్డినాండ్ కుగ్లర్ కేసులో మీ సాక్ష్యం వినడానికి సర్వోత్కృష్టుడవైన సత్యాదర్శనుడు కావడం వల్ల మీరు ప్రమాణం చేయవలసిన అవసరం లేదు. ప్రొసీడింగ్స్‌ని దృష్టిలో వుంచుకొని మేము మిమ్మల్ని అభ్యర్థించక తప్పదు. ఈ వ్యక్తికి సంబంధించిన విషయాలని సూటిగా చెప్పమనీ, ఇతర విషయాలు కేసుకు సంబంధించిన వాటిని మాత్రమే చెప్పమనీ."

"కుగ్లర్, నీవు సాక్షికి అంతరాయం కలిగించకు అతడికి అన్ని విషయాలూ తెలుసు. అందువల్ల నీవు వొప్పుకోక పోవడం వల్ల ఏ ప్రయోజనమూ లేదు."

"ఇప్పుడు, సాక్షీ మీరు ప్రారంభించండి"

అలా అన్న తర్వాత ప్రిసైడింగ్ జడ్జి తమ కళ్ళజోడును తీసేసి, ముందున్న బెంచిమీదకి వంగి సాక్షినుండి రానున్న సుదీర్ఘమైన ఉపన్యాయం కోసం ఎదురుచూస్తున్న వాడిలా సుఖంగా కూర్చున్నాడు. ముగ్గురిలోనూ కాస్త వయసు మీరిన జడ్జి నిద్రలోకి జారుకున్నాడు. ఇవన్నీ రికార్డు చేస్తున్న దేవదూత "జీవిత పుస్తకాన్ని" తెరచింది.

సాక్షి అయిన దేవుడు చిన్నగా దగ్గి ప్రారంభించాడు.

"అవును. కుగ్లర్, ఫెర్డినాండ్! ఫెర్డినాండ్ కుగ్లర్. ఓ ఫ్యాక్టరీ కార్మికుడి కొడుకు. చిన్నప్పటి నుండే చెడుతిరుగుళ్ళు తిరిగి ఎవరి మాటా వినని కుర్రవాడు. అతడు తన తల్లిని ఎంతగానో ప్రేమించేవాడు కాని ఆ ప్రేమను ఎలా చూపాలో తెలియక అల్లరి చిల్లరగా, మొండిగా వుండేవాడు. యంగ్‌మాన్! నీవు అందరినీ ఇరకాటంలో పెట్టేవాడివి. నిన్నోసారి నీ తండ్రి తన్నబోతే నీవు అతని బొటన వ్రేలు కొరికి పారిపోయావు గుర్తుందా నీకు? ఓ సారి నీవు మీ వూరిలో ఓ తోట నుంచి ఓ గులాబీ పూవుని దొంగిలించావు."

"ఆ గులాబీ ఇర్మా కోసం" అన్నాడు కుగ్లర్.

"నాకు తెలుసు" అన్నాడు దేవుడు. "ఇర్మాకి అప్పుడు ఆరేళ్ళు. ఆమెకి తర్వాత ఏం జరిగిందో నీవు విన్నావా?"

"లేదు నేను వినలేదు."

"ఆమె ఆస్కార్‌ని పెళ్ళి చెసుకుంది. అతడు ఫ్యాక్టరీ యజమాని. అతడి నుంచి వెనీరియల్ రోగం అంటించుకుని గర్భస్రావమై మరణించింది. నీకు రోడీ జరూబా గుర్తున్నాడా?"

"అతడికేమైంది?"

"అతడు నేవీలో చేరాడు. ప్రమాదవశాత్తూ బొంబాయిలో మరణించాడు. ఆ వూరిలోని అతి చెడ్డ కుర్రవాళ్ళు మీరిద్దరూ. ఫెర్డినాండ్ కుగ్లర్ పదేళ్ళు నిండకముందే దొంగ, అబద్ధాలకోరు. అతడికి చెడు సావాసాలుండేవి. వాళ్ళమీదా, వీళ్ళమీదా పడి బ్రతికేవాడు. అయినా కుగ్లర్ తన భోజనాన్ని గ్రిబల్‌తో పంచుకుని తినేవాడు."

ప్రిసైడింగ్ జడ్జి చేయి వూపాడు ఇదంతా అనవసరమేమోనన్నట్లుగా, కాని కుగ్లర్ కాస్త జంకుతూ అడిగాడు.

"అయితే..... అతడి కూతురుకేమయింది?"


"మేరీ?" దేవుడు అడిగాడు. "ఆమె ఎంతో హీనస్థితికి దిగజారింది. తమ పధ్నాలుగో ఏట పెళ్ళి చేసుకుని, ఇరవయ్యో ఏట చనిపోయింది. నీకు పధ్నాలుగేళ్ళు వచ్చేసరికి నీవు త్రాగుబోతువి. ఎన్నోసార్లు ఇంటినుండి పారిపోయినవాడివి. నిన్ను గురించిన బాధతో, దుఃఖంతో నీ తండ్రికి మరణం సంభవించింది. కన్నీరు కార్చి కార్చి నీ తల్లికి కండ్లు పోయాయి. నీ కుటుంబానికి నీవల్ల అపకీర్తి వచ్చింది. అందమైన నీ చెల్లెలు మార్తాకి అసలు పెళ్ళికాలేదు. దొంగవాడి ఇంటికి గౌరవనీయుడైన ఏ యువకుడూ రాలేదు పెళ్ళి సంబంధం కోసం. ఇప్పటికీ ఆమె ఒంటరిగా బ్రతుకుతోంది.... బీదరికంలో.... ప్రతిరాత్రీ బాగా చీకటిపడే వరకు బట్టలు కుట్టుకుంటూ.... అతి పొదుపుతో ఆమె అలసి పోయింది. తనకి పని ఇచ్చేవారి మాటలు ఆమె ఆత్మగౌరవాన్ని దెబ్బకొట్టాయి."

"ఇప్పుడు ఆమె ఏం చేస్తున్నది?"

"ఈ నిముషంలో ఆమె షాపులో దారంకొంటున్నది. ఆ షాపు నీకు గుర్తున్నాదా? ఒకసారి, నీకు ఆరేళ్ళప్పుడు నీవు ఓ రంగుల గోళీకాయుని కొన్నావు. అదే రోజున నీవుదాన్ని పోగొట్టుకొన్నావు. నీకు అది దొరకలేదు. నీవు ఎంత కుమిలి కుమిలి ఏడ్చావో నీకు గుర్తుందా?

"ఇంతకీ అది ఏమైపోయింది?" ఆత్రుతతో అడిగాడు కుగ్లర్.

"అది దొర్లిపోయి గోతిలోపడి బురదకుప్పకిందకు పోయింది. నిజానికి ఇంకా అది అక్కడే వున్నది. ముప్పై ఏళ్ళ తర్వాత. ఇదే సమయంలో భూమి మీద వాన కురుస్తోంది. నీ గోళీ చల్లటి నీటి వరదలో వణికిపోతోంది."



కుగ్లర్ తల వంచుకున్నాడు ఈ నిజం తెలియడం వలన కలిగిన ఉద్వేగంతో.

కాని ప్రిసైడింగ్ జడ్జి కళ్ళజోడుని తన ముక్కు మీద తగిలించుకొని సౌమ్యంగా అన్నాడు.

"సాక్షి! ఈ కేసు వ్యవహారంలో మనం కాస్త ముందుకు పోవాలి. ఇంతకీ ముద్దాయి ఆ హత్యలు చేశాడా లేదా?"

ఇక్కడ సాక్షి తలని ఆడించాడు.

"అతడు మొత్తం తొమ్మిది మందిని హత్య చేశాడు. మొదటి వ్యక్తిని అతడు ఓ కొట్లాటలో చంపాడు. కాని జైలు జీవితంలో అతడు బాగా చెడిపోయాడు. అతడి రెండవ విక్టిమ్ విశ్వాస ఘాతకియైన అతడి ప్రేయసి. ఈ నేరం కోసం అతడికి మరణశిక్ష విధించారు. కాని అతడు తప్పించుకున్నాడు. మూడవ హత్య అతడు డబ్బు లాక్కుని చంపిన ఓ వృద్ధుడు. నాలుగోవాడు ఓ నైట్ వాచ్‌మన్."

"అయితే అతడు చనిపోయాడా?" కుగ్లర్ ఆతృతతో అడిగాడు.

"భయంకరమైన నరక యాతన పడి మూడురోజుల తర్వాత అతడు చనిపోయాడు" అని దేవుడు అన్నాడు.

"అతడు తన ఆరుగురు పిల్లల్నీ అనాథలుగా విడిచి పోయాడు. అయిదవ, ఆరవ విక్టిమ్స్ ఓ వృద్ధ దంపతులు. అతడు వారిని ఓ గొడ్డలితో నరికి చంపితే పదహారు డాలర్లు మాత్రమే అతడికి దొరికాయి. కాని వారు ఇరవై వేల డాలర్లు దాచి ఉంచారు."

కుగ్లర్ ఎగిరి గంతేశాడు ఉత్సుకతతో "ఎక్కడ?"

"గడ్డి పరుపులో" దేవుడు అన్నాడు. "ఆ పరుపులో దాచిన ఓ పాత గుడ్డల మూటలో. వాళ్ళు తమ జీవితకాలంలో వాళ్ళనీ, వీళ్ళనీ మోసంచేసే పరమ లోభులుగా బ్రతికి, అత్యాసతో కడుపు కట్టుకోనీ కూడబెట్టిన సొమ్మది. ఏడవ మనిషిని అతడు అమెరికాలో చంపాడు. అతడూ తన స్వదేశీయుడే, భయభ్రాంతుడై స్నేహితులెవరూ లేని ఒంటరి కాందిశీకుడతడు-"

"అయితే ఆ డబ్బంతా పరుపులో ఉండన్నమాట" ఆశ్చర్యంలో గొణుక్కున్నాడు కుగ్లర్.

"అవును" తన ఉపన్యాసం కొనసాగించాడు దేవుడు. "ఎనిమిదవ మనిషి దారే పోయేవాడు. అతడు కుగ్లర్ దారికి అడ్డం వచ్చాడు. పోలీసుల చేతికి దొరక్కుండా పారిపోతున్నాడు కుగ్లర్ అప్పుడు. ఆ సమయంలో కుగ్లర్ ఏదో జబ్బుతో ఉన్నాడు. అది భరించరాని బాధ కలిగించే పెరియోస్టైటిస్. యువకుడా అప్పుడు ఎంతో బాధతో వున్నావు. తొమ్మిదవ వాడు, చివరివాడు పోలీస్‌మన్. అతడు కుగ్లర్‌ని చంపాడు. అదే సమయంలో కుగ్లర్ అతడిని కాల్చి చంపాడు."

"ముద్దాయి ఎందుకీ హత్యలు చేశాడు?" ప్రిసైడింగ్ జడ్జి ప్రశ్నించాడు.

"ఇతరులెందుకు హత్యలు చేస్తారో అందుకే. అనే కారణాల వల్ల." దేవుడు సమాధానమిచ్చాడు "కోపంతో.... ధనాపేక్షతో..... తెలిసీ.....తెలియకా..... ప్రమాదవశాత్తూ.... కొన్ని ఆనందం కోసం.... కొన్ని అవసరం వలనా.... అతడు చాలా ఉదార స్వభావుడు. ఇతరులకి తరచుగా సహాయపడేవాడు. అతడు స్త్రీలను దయతో చూసేవాడు. జంతువులతో ఎంతో ఆదరంతో మెలిగేవాడు తన మాటని నిలబెట్టుకునేవాడు. అతడు చేసిన మంచి పనులు చెప్పాలా నేను?"

"అతడు తన ఆరుగురు పిల్లల్నీ అనాథలుగా విడిచిపోయాడు. అయిదవ, ఆరవ విక్టిమ్స్ ఓ వృద్ధ దంపతులు. అతడు వారిని ఓ గొడ్డలితో నరికి చంపితే పదహారు డాలర్లు మాత్రమే అతడికి దొరికాయి. కాని వారు ఇరవై వేల డాలర్లు దాచి ఉంచారు."

"థాంక్ యూ" అన్నాడు ప్రిసైడింగ్ జడ్జి. "అది అవసరం లేదనుకుంటాను. ముద్దాయి తనేమైనా చెప్పుకోవలసినది వుందా?"

"లేదు" నిజాయితీ కలసిన నిర్లక్ష్యంతో అన్నాడు కుగ్లర్.

"ప్రస్తుతం ఈ న్యాయస్థానంలో న్యాయమూర్తులు ఈ విషయాన్ని చర్చిస్తారు" అని డిక్లేర్ చేశాడు ప్రిసైడింగ్ జడ్జి. ముగ్గురు న్యాయమూర్తులు లేచి లోనికి వెళ్ళారు.

కోర్ట్ రూములో దేవుడూ, కుగ్లర్ మాత్రమే మిగిలిపోయారు.

"ఎవరు వాళ్ళు?" లోనికి పోయిన జడ్జీలను తన తలతో చూపిస్తూ అడిగాడు కుగ్లర్.

"నీలాంటి మనుషులే" అని సమాధానమిచ్చాడు దేవుడు. "భూమి మీద కూడా వాళ్ళు జడ్జీలే. అందువల్ల ఇక్కడా ఆ భూమికలు నిర్వహిస్తున్నారు."

గోళ్ళు కొరుక్కుంటూ కుగ్లర్ అన్నాడు. "నేను అనుకున్నది.... నా ఉద్దేశం ఏమిటంటే.... నేను ఇలా వుంటుందని అసలు అనుకోలేదు- నేను మీరు జడ్జిగా వుంటారని అనుకున్నాను- ఎందుకంటే...."

"నేను దేవుణ్ణి కాబట్టి" వాక్యాన్ని పూర్తి చేశాడు ఆ మహానుభావుడు. "కానీ అదంతే, నీకు తెలియటం లేదా? ఎందుకంటే నాకు సర్వమూ తెలుసు. అందువల్లనే నేను న్యాయమూర్తిని కాలేను - అలా జరగదు ఎక్కడా! ఇంతకీ నీకు తెలుసా నిన్నెవరు మోసంతో బయటపెట్టారో?"

"లేదు నాకు తెలియదు. ఎవరది?" ఆశ్చర్యంతో అడిగాడు కుగ్లర్.

"లక్కీ అనే ఆ వెయిట్రెస్. అసూయవలన ఆమె అలా చేసింది."

"క్షమించండి" కుగ్లర్ కాస్త ధైర్యం పుంజుకొని అడిగాడు. "నేను చికాగోలో కాల్చిచంపిన ఆ పనికిమాలిన టెడ్డీని మీరు మరిచిపోయారు."

"లేదు లేదు" అన్నాడు దేవుడు. "అతడు గాయాల నుంచి కోలుకున్నాడు. ఈ నిముషంలో కూడా అతడు బ్రతికే వున్నాడు. అతడు ఇన్‌ఫార్మర్ అని నాకు తెలుసు. లేకపోతే అతడు చాలా మంచివాడు. అతడికి పిల్లలంటే ఎంతో ఇష్టం. ఏ మనిషీ పూర్తిగా పనికిమాలిన వాడని అనుకోవడానికి వీల్లేదు."

"కాని నాకు మీరు జడ్జి ఎందుకు కాలేదో అసలు బోధపడటం లేదు" సాలోచనగా అన్నాడు కుగ్లర్.

"ఒకే కారణం. నాకున్న విషయ పరిజ్ఞానం అనంతం కావటం వలన. జడ్జీలకు అన్నీ తెలిస్తే... సర్వస్వమూ అవగాహన అయితే.... అప్పుడు వాళ్ళకి అన్నీ అర్థమవుతాయి. అప్పుడు వాళ్ళ హృదయాలు క్షోభిస్తాయి. వాళ్ళు దేనినీ న్యాయ దృష్టితో చూడలేరు. నేను అంతే. ఆ జడ్జీలకు నీవు చేసిన నేరాల గురించి మాత్రమే తెలుసు. నాకు పూర్తి కుగ్లర్ తెలుసు. అందువలననే నేను జడ్జిని కాలేదు."

"అయితే వాళ్ళే ఎందుకు విచారణ

చేస్తున్నారు? భూమి మీద కూడా జడ్జీలుగా వున్నవాళ్ళు?"

"ఎందుకంటే మనిషి మనిషికే చెందుతాడు."

"నీవు చూస్తున్నట్లుగానే నేను కేవలం ఓ సాక్షిని. న్యాయ నిర్ధారణ చేసేదీ, తీర్పునిచ్చేది మానవులే. స్వర్గంలో కూడా. నన్ను నమ్ము కుగ్లర్ ఈ పద్ధతి ఇలాగే వుండాలి. మానవుడు దైవ న్యాయానికి అర్హుడు కాడు. అతడికి తగినది ఇతర మానవుల న్యాయమే."

అదే సమయంలో ఛాంబర్ నుండి ముగ్గురు జడ్జీలు తిరిగి వచ్చారు.

బరువైన కంఠంతో ప్రిసైడింగ్ జడ్జి ప్రకటించాడు.

"మళ్ళీ మళ్ళీ చేసిన నేరాలకీ - ఫస్ట్ డిగ్రీ హత్యలకీ, దొంగతానాలకీ, న్యాయానికి చేసిన అగౌరవానికి, ఆయుధాలని వాడినందుకూ, గులాబీని దొంగిలించినందుకూ ఫెర్డినాండ్ కుగ్లర్‌కి నరకంలో జీవితకాల శిక్ష విధించడమైనది. ఈ శిక్ష తక్షణమే ప్రారంభమవుతుంది.

"తర్వాత కేస్ ప్లీజ్ : టొరాన్స్, ఫ్రాంక్"

"ముద్దాయి కోర్టులో హాజరులో వున్నాడా?"

**"**

# శ్రమజీవి నిండు హృదయావిష్కరణ

--గిరిప్రసాద్ చెలమల్లు; నాగార్జునసాగర్

గోదావరి గట్టుకు - గోదావరికి కథల్లో - సీరియల్‌లో ఒక ప్రత్యేక స్థానం లభించిందెందుకో గాని "ఎసరూ - అత్తిసరూ" కథలో సైతం గోదావరి చోటు చేసుకుంది. కాయకష్టం చేసుకుని బ్రతికే సత్తిగాడు వర్ధనమ్మగారి మాగాయి పచ్చడి-వేడి అన్నం కోసం గోదారి పొంగుతున్నా లెక్కచేయక వరదల్లో కొట్టుకొచ్చే దుంగల్ని గట్టుకు చేరవేయడంలో అతని అమాయకత్వం కనబడుతుంది. ఆ దృశ్యాన్ని అమోఘంగా తనదైన శైలిలో రాసారు రచయిత- సరదా కోసం చేసినా - పట్టెడన్నంకోసం చేసినా అతను చేసేది సాహసకృత్యమని అతనికి తెలియదు. సత్తిగాడికి తెల్సిందల్లా ఒక్కటే! వర్ధనమ్మగారికి దుంగల్ని ఇవ్వటం మాత్రమే!

కోడలు కపుల మనస్తత్వాన్ని - కొడుకు చేతకాని తానన్ని కొద్దిగ్గానే ప్రస్తావించడం సందర్భోచితంగానే వుంది. గోదారి ఈది అలసిపోయిన సత్తిగాడు అన్నం ఎక్కువగానే తినటం. - గంజి సైతం త్రాగేయడం సహజంగా జరిగేదే!! కాయకష్టం చేసే కూలీలు ఎక్కువగా తినటం సహజమే!!

బొంతరటిపండు నాకు చాలా యిష్టం అని సత్తిగాడు అనగానే ఆయునక్కూడా ఇష్టమేరా! అని బామ్మగారు ఫ్లాష్‌బ్యాక్‌లోకెళ్ళిపోవటం- "ఆయున" పేరు చెప్పడానికి సిగ్గుపడటం రచయిత సందర్భోచితంగా చెప్పారు.

సత్తిగాడు దుంగలు తెస్తే నీవు వాడికి అన్నం వండిపెట్టాలా?! రూపాయి పడేస్తే బండెడు పుల్లలు వస్తాయని కసురుకున్న భాస్కరం బామ్మపోతే సత్తిగాడు తెచ్చిన దుంగతోనే కాల్చివేయాల్సి వస్తుందని ముందే వూహించలేకపోయాడు ఎవరితోనైనా అవసరమొస్తుందని...

సత్తిగాడు ప్రొద్దుననగా గోదావరిలో కెళ్ళి ఇంకా రాలేదని పైడమ్మ చెప్పగానే వర్ధనమ్మ పడిన ఆవేదనను - హైరానాను

పాఠకుల మదిలో మిగిలేటట్లు రాయగలిగారు రచయిత.

ఏదిఏమైనా బామ్మగారు చనిపోయిన రోజున చిల్లిగవ్వలేని భాస్కరం సత్తిగాడు తెచ్చిన దుంగనమ్మి అంత్యక్రియలకు డబ్బులను సమకూర్చగలిగినానే సత్యాన్ని గ్రహించగలిగితే చాలు అని రచయిత ఇచ్చిన సందేశం బావుంది.

* * *

